Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
11-05-2026

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 134 | పేజీలు-08 | వెల-రూ.1
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD | సోమవారం | WWW.EPAPER.MAHAADAILY.COM



## విజయ్ పట్టాభిషేకంలో స్పెషల్ ఎట్రాక్షన్‌గా త్రిష

### ప్రమాణస్వీకారం వేళ ఆకట్టుకున్న అందాల తార

**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయ చరిత్రలో నూతన శకానికి నాంది పలికిన దళపతి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలో వెండితెర ధ్రువతార త్రిష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం రాజకీయ ఉద్ధండులు, అశేష జనవాహినితో కిక్కిరిసిపోయినప్పటికీ, అందరి కళ్లు ఒక్కసారిగా త్రిషపైనే పడ్డాయి. విజయ్‌తో అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించి, వెండితెరపై విజయవంతమైన జోడీగా పేరు తెచ్చుకున్న ఆమె, తన ప్రాణ స్నేహితుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని కళ్లారా వీక్షించేందుకు తరలివచ్చారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- ప్రధాని మోదీకి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ లేఖ


02



### 12న కేసీఆర్ కీలకభేటీ

- ముఖ్యనేతలతో సమావేశం

02



### బంగారం కొనడం మానేద్దాం

- మహిళలకు మోదీ పిలుపు
- విదేశీ ప్రయాణాలు తగ్గించండి

02



# బెంగాల్‌లో గెలిచాం

## తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం

- కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ అవినీతి ఉంటుంది
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉంది
- ఎవరూ బంగారం కొనకండి.. మహిళలు శపథం చేయండి
- డీజిల్, పెట్రోల్ వినియోగం తగ్గించండి.. ఆఫీసులు వర్క్ ఫ్రమ్ చేయండి
- భారీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ

**హైదరాబాద్, మహా :** బెంగాల్ లో తొలిసారిగా బీజేపీ గెలిచిందని, తెలంగాణలోనూ అదికారంలోకి వస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర పర్యటన సందర్భంగా రాష్ట్ర బీజేపీ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రధాన మంత్రి మాట్లాడారు. దేశ మంతా బీజేపీ పాలన కోరుకుంటుందని తెలంగాణ ప్రజలు కూడా అందుకు సిద్దమయ్యారన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలన్నప్పుడు రాజకీయ పార్టీలకు గెలుపు ఓటములు సహజమని, అయితే బెంగాల్ లో బీజేపీ గెలుపుపై దేశ వ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరుగుతోందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఓడిపోయింది రాజకీయ పార్టీ కాదని, రాజ్యాంగ వ్యతిరేక శక్తులని అన్నారు. పశ్చిమబెంగాల్‌లో అవినీతి, కుటుంబ పార్టీలను ప్రజలు ఓడించారని తెలిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అస్సోంలోనూ విజయం సాధించామని, పుదుచ్చేరిలోనూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి రాజ్యమేలుతుందని ప్రధాని మోదీ విమర్శించారు. బెంగాల్ ప్రజలు టీఎంసీ, లెఫ్ పార్టీలను పక్కనపెట్టారని, మమతా బెనర్జీ నియంతృత్వానికి చరమగీతం పాడారన్నారు.

### తెలంగాణలోనూ సర్కార్

"తెలంగాణలో అందరి నోట ఒకటే మాట వినిపిస్తోంది. తెలంగాణలో కూడా బీజేపీ సర్కార్ ఏర్పడాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రతి ఏటా దేశంలో ఏదో రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల్లో కొందరు గెలుస్తారు, కొందరు ఓడుతారు. కానీ ఈ సారి జరుగుతున్న చర్చ ఎప్పుడూ జరగలేదు. బెంగాల్ ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛావాయువు పీల్చుకుంటున్నారు. పదేళ్ల క్రితం బెంగాల్‌లో ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండేవారు. ఇప్పుడు 200 మందికి పైగా బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచారు. మొదట్లో బీజేపీకి ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉండేవారు... అందులో ఒకరు తెలంగాణ వ్యక్తి.



వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కూడా భారీ మెజార్టీతో గెలుస్తాం" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ కుటుంబ పార్టీలే అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. దేశంలో 14 ఇండస్ట్రియల్ కారిడార్ల పనులు జరుగుతున్నాయని, అందులో ఒకటి జహీరాబాద్‌లో

మిగతా 2లో

### మాతో కలవండి.. కలిసి పనిచేద్దాం

- సీఎం రేవంత్ కు మోదీ పిలుపు
- తెలంగాణపై పెద్దమనసు చూపాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- రూ. 9,377 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- సైబరాబాద్ అభివృద్ధిపై ప్రధాని ప్రశంసలు
- అతిపెద్ద ఉపాధి కేంద్రంగా మారుతోందని నరేంద్ర మోదీ




02




# తమిళనాట సరికొత్త చరిత్ర

## సీఎంగా విజయ్ ప్రమాణస్వీకారం

- ఐదు సంచలన దస్త్రాలపై విజయ్ తొలి సంతకాలు
- సామాజిక న్యాయమే లక్ష్యంగా కేబినెట్ కూర్పు
- మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణం
- ముఖ్యమంత్రిగా విజయ్ ఉద్వేగభరిత తొలి ప్రసంగం
- ప్రమాణస్వీకారంలో ప్రత్యేక ఆకర్షణగా రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీకి 'మై బ్రదర్' అంటూ ఆహ్వానం
- విజయ్ సర్కారు ఏర్పాటుపై రాహుల్ అభినందనలు
- అగ్రనేతలు, సినీ తారల రాకతో దద్దరిల్లిన నెహ్రూ స్టేడియం
- ప్రధాని మోదీ, సీఎం రేవంత్ సహా దేశవ్యాప్తంగా రాజకీయ, సినీ, రాజకీయ ప్రముఖుల శుభాకాంక్షలు
- సూటులో ప్రమాణస్వీకారం.. వెంటనే పని ప్రారంభం



**చెన్నై, మహా:** తమిళనాడు రాజకీయ వేదికపై ఆరు దశాబ్దాల ద్రావిడ పార్టీల ఏకఛత్రాధిపత్యానికి తెర దించుతూ సరికొత్త చరిత్ర ఆవిష్కృతమైంది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత, వెండితెర వేల్పు దళపతి సి. జోసెఫ్ విజయ్ ఆదివారం నాడు తమిళనాడు రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా అట్టహాసంగా బాధ్యతలు స్వీకరించారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు అశేష జనవాహిని, అభిమానుల జయజయధ్వానాల మధ్య గవర్నర్ రాజేంద్ర అర్లేకర్ ఆయనతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. కేవలం పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలోనే, తన మేనిఫెస్టోతో ప్రజల మనసు గెలుచుకుని, తొలిసారి పోటీ చేసిన ఎన్నికల్లోనే ప్రభంజనం సృష్టించి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం దేశ రాజకీయాల్లోనే ఒక సంచలనంగా మారింది. స్టేడియం లోపలే కాకుండా వెలుపల కూడా లక్షలాది మంది అభిమానులు తమ దళపతి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తుంటే

మిగతా 2లో

### జూన్ 2 డెడ్ లైన్

- అప్పటిలోగా అమలు చేయాల్సిందే...
- టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్

**హైదరాబాద్, మహా:** ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు జూన్ 2 వరకు కాంగ్రెస్ ప్రభుత్వానికి గడువు ఇస్తున్నామని.. అప్పటిలోగా అమలు చేయాల్సిందేనని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఉద్యమకారుల సంఘాలతో టీఆర్ఎస్ చీఫ్ సమావేశం అయ్యారు.


మిగతా 2లో

# బరితెగించిన అక్రమార్కులు

## కొండాపూర్ సర్వే నెంబర్ 59 గల్లంతు

- ఆరు వందల గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- విలువ రు 10 కోట్ల పై మాటే.. నకిలీ పత్రాలతో అనుమతులు
- రెండు నిర్మాణాలకు స్టిల్ట్ ప్లస్ మూడు ఫ్లోర్లకు పర్మిషన్లు
- నిర్మించేది మాత్రం ఏడు ఫ్లోర్లు ఆపైన పెంట్ హౌస్ నిర్మాణాలు
- సర్వే నెంబర్ 60 లో జిహెచ్ఎంసీ అనుమతులు పొంది, సర్వే నెంబర్ 59 లో గల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు
- సిఎంసి కమీషనర్ స్పందించాలంటున్న స్థానికులు

రాజధాని నడిబొడ్డు.. సైబరాబాద్ కార్పోరేషన్ పరిధిలోని కొండాపూర్ లో అక్రమార్కులు బరితెగించారు.. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పక్కా స్కెచ్ వేసి దురాక్రమణకు తెగబడుతున్నారు... నకిలీ పత్రాలు సృష్టించి జి హెచ్ ఎం సి నుండి అనుమతులు పొంది నిర్మాణాలు సాగించటం ఇక్కడ పరిపాటిగా మారింది.. ఆరు వందల గజాల ప్రభుత్వ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రు 10 కోట్ల పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.. ప్రభుత్వ భూమి కబ్జా కు గురైందని రెవె న్యూ అధికారలుకు పిర్యాదు చేసిన కబ్జా దారులతో కుమ్మక్కయ్యారని ఎటువంటి చర్యలు తీసుకోలేదని బహిరంగ ఆరోపణలు వ్యక్త మౌతున్నాయి.. అనుమతులు మించి నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.



03



## ఆత్మీయ పలకరింపులు.. అరుదైన జ్ఞాపకాలు

- చంద్రబాబు ఇంట పూజలు.. పవన్ నివాసంలో పరామర్శలు
- హైదరాబాద్ పర్యటనలో ప్రధాని ఆత్మీయ ముద్ర
- చంద్రబాబు నివాసంలో గంటకు పైగా ప్రధాని మోదీ

వివరాలు 2లో




# బెంగాల్‌లో గెలిచాం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉందని, కాంగ్రెస్ ఎక్కడున్నా ఒకటే మోడల్ అదే అవినీతి మోడల్ అంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు అలవికాని హామీలు ఇస్తారని, ఆఖాశంలోని కచుక్కలను తీసుకు వస్తామని చెబుతారంటూ ఎన్నికలైన తర్వాత వాటిని విస్మరించి ప్రజలను మోసం చేస్తారన్నారు. హామీల గురించి అడిగితే సాకులు వెతుకుతారని చెప్పారు. తెలంగాణలో కూడా ఇదే జరుగుతోందని విమర్శనాస్త్రాలను సంధించారు. కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ ప్రజలు కాంగ్రెస్ ను గెలిపించినందుకు బాధ పడుతున్నారని, తెలంగాణలోనూ మీరంతా కాంగ్రెస్ పాలన పట్ల ఆగ్రహంతో ఉన్నారన్న విషయం తెలుస్తోందన్నారు. కాంగ్రెస్ విధానం మొదట ఓట్లు దండుకో ఆ తర్వాత మరిచిపో అన్నట్లు ఉంటుందన్నారు. కాంగ్రెస్ విద్వేష రాజకీయాలను రెచ్చగొడుతోందని ప్రధాని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎంఎంసీగా మారిందని అంటూ ఎంఎంసీ అంటే అంటే ముస్లిం లీగ్ మావోవాది కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. మావోయిస్టులతో తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని, తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించినందుకు ప్రజలు బాధపడుతున్నారన్నారు. "కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు మావోయిస్టులకు అండగా ఉన్నాయి. మావోయిస్టులు తమ అంతిమ శ్వాసను లెక్కబెట్టుకుంటున్నారు. మావోయిస్టులపై



చర్యలు తీసుకోడానికి కాంగ్రెస్ ముందుకు రాలేదు. కాంగ్రెస్ పార్టీ మావోయిస్ట్ పార్టీగా మారింది. తెలంగాణ పోలీసులకు ఫ్రీ హ్యాండ్ ఇచ్చి ఉంటే మావోయిస్టులను అణిచివేసేవారు. అప్పుడు తెలంగాణ మావోయిస్టు రహితంగా మారుతోంది" అంటూ ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు.

### యుద్ధం వల్లే చమురు సంక్షోభం

యుద్ధం కారణంగా ఇంధనం సంక్షోభం వచ్చిందిని ప్రధాని మోదీ వివరించారు. అయినా ఇంధనం రేట్లు పెంచడం లేదన్న ఆయన పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. మెట్రో సేవలను వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మెట్రో రైళ్ళు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు వీలైనంత వరకు మెట్రో రైలును వినియోగించుకోవాలన్నారు. ఒకప్పుడు యుద్ధాలు వస్తే ప్రజలు తమ వద్ద బంగారాన్ని ఇచ్చే వారని ఇప్పుడు ఆ పని చేయవద్దంటూ మీరంతా వంట నూనెల వాడకం తగ్గించండి, విదేశీ వస్తువుల వినియోగాన్ని తగ్గించండి, ఇంధన పొదుపు కోసం ఉపక్రమించండి, ఏడాది పాటు బంగారం కొనుగోలు చేయకండని పిలుపునిచ్చారు.

## వర్క్ ఫ్రం హోంకు ప్రాధాన్యత ఇవ్వండి

ఇంధన పొదుపులో భాగంగా కార్యాలయాలు, ఐటీ కంపనీలు వీలైనంత వరకు వర్క్ ఫ్రం హోంకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రధాని సూచించారు. ప్రజలు వీలైనంత వరకు వ్యక్తి గత వాహనాల వినియగాన్ని తగ్గించుకోవాలని సూచించారు. కార్లు లాంటి పెద్ద వాహనాలను వాడినపుడు తమతో పాటు మరికొంత మందిని తీసుకు వెళ్ళేందుకు ప్రయత్నించాలన్నారు. 'ప్రపంచం ఎన్నో సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొంటోంది. పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాతో సప్లయ్ చైన్ దెబ్బతింది. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయి. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోంది. ధరలను పెంచడం లేదు, ప్రజలపై భారం వేయడం లేదు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలకు నా వినతి. పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించండి. విదేశీ మాదకద్రవ్యాన్ని మనం కాపాడుకోవాలి. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలి. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలి. ప్రజా రవాణాను వినియోగించాలి. మధ్యతరగతి ప్రజలు ఖర్చులు తగ్గించుకోవాలి. మధ్యతరగతి ప్రజలు విదేశీ ప్రయాణాలు మానుకోవాలి' అని అన్నారు.

# జూన్ 2 డెడ్ లైన్

(మొదటిపేజీ తరువాయి)

ఉద్యమకారుల డిమాండ్లకు కవిత మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అప్పటికీ హామీలు అమలు చేయకుంటే ఉద్యమకారులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జార్ఖండ్ ప్రభుత్వం ఉద్యమకారులకు అందిస్తున్న సంక్షేమ పథకాల తరహాలో తెలంగాణలో ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు భువనగిరి జిల్లా కేంద్రంలో సభ నిర్వహించాలని, భూ పోరాటాలు ఉధృతం చేయాలని, జిల్లాల వారీగా ఉద్యమకారులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు రూప్ సింగ్, సయ్యద్ ఇస్మాయిల్, మలి దశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ అంజిరెడ్డి, ఉపాధ్యక్షుడు మూల ప్రభాకర్ గౌడ్, కార్యదర్శులు వెలమల రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేపీసీ అధ్యక్షులు బోగి పద్మ, నాయకులు గుస్సా రవీందర్, అరుణ పాల్గొన్నారు.

# మాతో కలవండి.. కలిసి పనిచేద్దాం

**సీఎం రేవంత్ కు మోదీ పిలుపు**

- తెలంగాణపై పెద్దమనసు చూపాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- రూ. 9,377 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ
- సైబరాబాద్ అభివృద్ధిపై ప్రధాని ప్రశంసలు
- అతిపెద్ద ఉపాధి కేంద్రంగా మారుతోందని నరేంద్ర మోదీ

**హైదరాబాద్, మహా :** దేశాభివృద్ధిలో సైబరాబాద్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. సైబరాబాద్ ప్రస్తుతం ఒక అతిపెద్ద ఉపాధి కేంద్రంగా ఎదిగిందని, ముఖ్యంగా సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో ఈ ప్రాంతం విశేషమైన సేవలందిస్తోందని పేర్కొన్నారు. అనేక భారీ ప్రాజెక్టులు ఇక్కడ పురుడు పోసుకోవడం గర్వకారణమని, ఇవన్నీ దేశ పురోగతికి బాటలు వేస్తాయని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ సారి ప్రధానమంత్రి అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన మోదీ హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో సుమారు రూ. 9,377 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. వరంగల్‌లో ప్రారంభించిన పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్కు దేశీయ జౌళి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని, దీని ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, దీనివల్ల తెలంగాణ ఎంతగానో లాభపడుతుందని ప్రధాని అన్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పన మరియు పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన ప్రాజెక్టులు ఈ విధంగా ఉన్నాయి. జాతీయ రహదారి 167 విస్తరణలో భాగంగా గుడెబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు పనులు (3,175 కోట్ల రూపాయలు). 21 కి.మీ. కాజీపేట రైల్ అండ్ రైల్ బైపాస్ రైల్వే లైను ( 292 కోట్ల రూపాయలు). 118 కి.మీ. కాజీపేటవిజయవాడ మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టు ( 1,243 కోట్ల రూపాయలు). హైదరాబాద్ సమీపంలోని మల్కాపూర్ వద్ద నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ పీవోఎల్ (611 కోట్ల రూపాయలు). వరంగల్‌లోని 'పీఎం మిత్ర' కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (1,695.54 కోట్ల రూపాయలు). జహీరాబాద్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ( 2,360.54 కోట్ల రూపాయలు). హెచ్ఐసీసీ వేదికగా జరిగిన ప్రధాన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ప్రారంభోత్సవాలకు ముందు సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణపై పెద్ద మనసు చూపాలని విజ్ఞప్తి చేశారు.



## ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజం

ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు సహజమని, అలాగనీ బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రం ఏ మాత్రం వివక్ష చూపడం లేదని మోడీ పేర్కొన్నారు. రాష్ట్రాలన్నీ సమగ్రాభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోతుందన్నారు. తెలంగాణకు గతంలో కంటే ఎక్కువ నిధులను కేంద్రం ఇస్తుందన్నారు. అన్ని రంగాలలో అన్ని ప్రాంతాలు సమప్రాతినిధ్యం కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలు, ఎన్నికలు, గెలుపు, ఓటములను పట్టించుకోకుండా ప్రజాహితమే పరమావధిగా పని చేస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితులలో దేశంలో ఇంధన సంక్షంభం ఉందని, అయినప్పటికీ ప్రజలపై భారం వేయకుండా కేంద్రం ముందుకు వెళ్తుందన్నారు.




2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 2047 నాటికి త్రి త్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు తెలంగాణ ఎదిగేందుకు కావాల్సిన రోడ్ మ్యాప్ తో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైల్ విస్తరణ, మూసీ సుందరీకరణ తదితర పథకాలకు నిధులపై ప్రస్తావించారు. రాజకీయాలకు పోవడం లేదన్న సీఎం గతంలో కేంద్రంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో మీరు గుజరాత్ సీఎంగా ఉన్నారని, ఆ సమయంలో మన్మోహన్ సింగ్ గుజరాత్ అభివృద్ధికి ఉదారంగా నిధులిచ్చారంటూ,ా తరహాలో మీరు తెలంగాణకు నిధులివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. సీఎం విజ్ఞప్తిపై స్పందించిన ప్రధాని మోడీ మన్మోహన్ సింగ్ పీఎంగా ఉన్న సమయంలో గుజరాత్ కోసం కేటాయించిన నిధులలాగే తెలంగాణకు కేటాయిస్తే ప్రస్తుతం ఇస్తున్న నిధులలో సగమే వస్తాయని పేర్కొన్నారు. ఒకవేళ అలాగే కావాలంటే.. తెలంగాణ అనుకున్న స్థాయికి అభివృద్ధి చెందలేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి నడిస్తేనే తెలంగాణ లక్ష్యాలు నెరవేరుతాయని పేర్కొన్న ప్రధాని మోదీ.. తమతో కలవాలని, కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. వరంగల్‌లో ఏర్పాటు కానున్న పీఎం మిత్ర పార్క్.. దేశంలో సరికొత్త వస్త్ర విప్లవాన్ని తీసుకువస్తుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత వస్త్ర పరిశ్రమ కీలక పాత్ర పోషించిందని.. తిరిగి ఆ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే బడ్జెట్ రూ. 1,000 కోట్ల లోపే ఉండేదని.. కానీ ఇప్పుడు ఒక్క తెలంగాణకే సుమారు రూ.5,500 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 50 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు జరుగుతున్నాయని వివరించారు. గత 11 ఏళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ రెట్టింపు అయినట్లు గుర్తు చేశారు. సోలార్ పవర్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఎదుగుతోందని పేర్కొన్న ప్రధాని మోదీ.. ఇంధన భద్రత కోసం భారీగా పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు.

# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

### ప్రధాని మోదీకి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ లేఖ

**హైదరాబాద్, మహా:** ప్రధాని మోదీకి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని బహిరంగ లేఖలో 8 అంశాలను ప్రస్తావించారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు ఆమోదం, మూసీ పునరుజ్జీవనానికి అనుమతులు, రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ భాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

### 12న కేసీఆర్

# కీలకభేటీ

### ముఖ్యనేతలతో సమావేశం

**హైదరాబాద్, మహా:** ఈ నెల 12న ఎర్రవల్లిలో కేసీఆర్ నివాసంలో బీఆర్ఎస్ కీలక సమావేశం జరగనుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ నేతలు సమావేశం కానున్నారు. సమావేశంలో కేటీఆర్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, శాసనసభ, మండలి ఉపనాయకులు పాల్గొననున్నారు. సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల నమోదుపై చర్చించనున్నారు.

# తమిళనాట సరికొత్త చరిత్ర



(మొదటిపేజీ తరువాయి)

ఆనందంతో కేరింతలు కొట్టారు.

**దిగ్గజాల సమక్షంలో అపూర్వ ఘట్టం.. రాహుల్ గాంధీ, త్రిషల సందడి**

ఈ చారిత్రాత్మక వేడుకకు దేశవ్యాప్తంగా ఉన్న రాజకీయ, సినీ రంగానికి చెందిన ఉద్దండులు సాక్ష్యంగా నిలిచారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరుకాగా, విజయ్ ఆయనను సాదరంగా ఆహ్వానించారు. రాహుల్ గాంధీ చేతిని పైకెత్తి విజయ్ అభివాదం చేయడం వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, సీనియర్ నేత తమిళిసై సౌందరరాజన్, నాగేంద్రన్ తదితర రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. సినీ పరిశ్రమ నుంచి ప్రముఖ నటి త్రిష బ్లూ కలర్ పట్టు చీరలో మెరిసిపోతూ ఈ వేడుకలో పాల్గొన్నారు. "ఔను.. ఈరోజు బిగ్ డే, దీని కోసమే నేను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాను" అంటూ త్రిష తన ఆనందాన్ని పంచుకున్నారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, సినీ దిగ్గజాల రాకతో చెన్నై నగరం మొత్తం ఒక పండుగలా మారిపోయింది.

**సామాజిక న్యాయమే లక్ష్యంగా కేబినెట్ కూర్పు.. మంత్రులుగా తొమ్మిది మంది ప్రమాణం**

ముఖ్యమంత్రి విజయ్‌తో పాటు ఆయన కేబినెట్‌లో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనుభవం, యువత, సామాజిక సమతుల్యత కలగలిసి ఈ మంత్రివర్గం ఏర్పాటైంది. శివకాశి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తెలుగు అమ్మాయి కీర్తనకు మంత్రివర్గంలో చోటు కల్పించి మహిళా సాధికారతకు విజయ్ పెద్దపీట వేశారు. విజయ్‌కు అత్యంత నమ్మకస్తుడైన ఎన్. ఆనంద్, ఎన్నికల వ్యూహకర్తగా అనుభవం ఉన్న అదవ్ అర్జున, అన్నాడీఎంకే ప్రభుత్వంలో సుదీర్ఘకాలం పనిచేసిన సీనియర్ నేత కేఏ సెంగొట్టియన్‌లకు కీలక బాధ్యతలు అప్పగించారు. వీరితో పాటు ఐటీ రంగంలో పట్టున్న నిర్మల్ కుమార్, ఎస్సీ ప్రతినిధిగా కేజీ అరుణరాజ్, అలాగే పి. వెంకటరమణన్, ఎ. రాజమోహన్, టీకే ప్రభు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ బృందం పనిచేస్తుందని విజయ్ భరోసా ఇచ్చారు.

**కలం పట్టిన క్షణమే సంక్షేమ విప్లవం.. ఉచిత విద్యుత్, బస్సు ప్రయాణంపై తొలి సంతకాలు**

ప్రమాణస్వీకారం పూర్తి చేసిన వెంటనే ముఖ్యమంత్రి విజయ్ నేరుగా పాలనపై తన మార్క్ చూపించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు '200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్' పథకానికి సంబంధించిన ఫైలుపై ఆయన తన తొలి సంతకం చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి లభించనుంది. అలాగే, మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తూ మరో కీలక సంతకం చేశారు. ఒక సామాన్య సోదరుడిగా మహిళలకు తానిచ్చే గౌరవం ఇదని ఆయన పేర్కొన్నారు. కేవలం హామీలు ఇవ్వడమే కాదు, వాటిని తక్షణమే అమలు చేయడంలో తనకున్న చిత్తశుద్ధిని విజయ్ ఈ నిర్ణయాల ద్వారా నిరూపించుకున్నారు.

**మహిళా భద్రతకు 'షీ టీమ్స్'.. డ్రగ్స్‌పై 'ఈగల్' తరహాలో ఉక్కుపాదం**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు విజయ్ అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. మహిళల భద్రత కోసం తెలంగాణలో విజయవంతమైన 'షీ టీమ్స్' తరహాలో ప్రత్యేక విభాగం ఏర్పాటుపై ఆయన సంతకం చేశారు. మహిళలు సమాజంలో నిర్భయంగా తిరిగేలా పటిష్టమైన రక్షణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలోని యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించడానికి 'ఈగల్' పేరుతో ఒక శక్తివంతమైన యాంటీనార్కోటిక్స్ వ్యవస్థ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. "ఇది మీ ప్రభుత్వం.. డ్రగ్స్‌పై యుద్ధం ఈ రోజే ప్రారంభమైంది" అంటూ విజయ్ చేసిన ప్రకటన అక్రమ రవాణాదారులకు హెచ్చరికగా నిలిచింది. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన ఖరాకండిగా చెప్పారు.

**"నేను మీలో ఒకడిని".. భావోద్వేగ ప్రసంగంతో కదిలించిన నూతన ముఖ్యమంత్రి**

ప్రమాణ స్వీకారం అనంతరం విజయ్ చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించింది. "నేను ఏ రాజకుటుంబంలోనూ పుట్టలేదు.. పేదరికం, ఆకలి అంటే ఏంటో నాకు తెలుసు. సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే సామాన్యుడికి జన్మించాను.. నేను మీలో ఒకడిని, మీ తమ్ముడిని" అంటూ ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. ప్రజల సొమ్మును ఒక్క పైసా కూడా తాను ముట్టుకోబోనని, పారదర్శకమైన మరియు అవినీతి రహిత పరిపాలన అందిస్తానని శపథం చేశారు. తనకు అప్పగించిన ఈ గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించేందుకు కొంత సమయం ఇవ్వాలని ప్రజలను కోరారు. "నేను దేవుణ్ని కాదు, అసాధ్యమైన హామీలు ఇవ్వను.. కానీ మిమ్మల్ని చూస్తుంటే ఏదైనా సాధించగలను అనిపిస్తోంది" అని విజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయన నిరాడంబరతను చాటిచెప్పాయి.

**సరికొత్త సెక్యులర్ సోషల్ జస్టిస్.. రాహుల్ గాంధీకి 'మై బ్రదర్' అంటూ ఆహ్వానం**

రాష్ట్రంలో లౌకికవాదం మరియు సామాజిక న్యాయంతో కూడిన పరిపాలన కొనసాగుతుందని విజయ్ స్పష్టం చేశారు. తన విజయానికి సహకరించిన కాంగ్రెస్, కమ్యూనిస్టు, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీల నేతలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా వేదికపై ఉన్న రాహుల్ గాంధీని 'మై బ్రదర్' అని సంబోధించి, ఆయన చేతిని పట్టుకుని అభివాదం చేయడం అందరినీ ఆకట్టుకుంది. "ఇది ఒక సరికొత్త ప్రారంభం.. నిజమైన సెక్యులర్ సోషల్ జస్టిస్ ఎరా మొదలైంది" అని ఆయన ఉద్ఘాటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలోనే ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేస్తానని, దాని ఆధారంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తానని విజయ్ హామీ ఇచ్చారు. 8 కోట్ల మంది తమిళులే తన కుటుంబమని, వారందరికీ తాను జవాబుదారీగా ఉంటానని పేర్కొన్నారు.

**జాతీయ నేతల అభినందనలు.. సెల్ఫీ వీడియోతో చిరస్మరణీయ వేడుక**

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని మోదీ భరోసా ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం విజయ్‌కు అభినందనలు తెలియజేశారు. తన ప్రమాణ స్వీకార వేడుకకు హాజరైన లక్షలాది మంది అభిమానులు, నేతలతో కలిసి విజయ్ స్వయంగా సెల్ఫీ వీడియో తీసుకున్నారు. ఈ అపూర్వ క్షణాలను తన ఫోన్లో బంధించి, ప్రతి ఒక్కరితో పంచుకున్నారు. సుదీర్ఘ రాజకీయ పోరాటాల తర్వాత, ఒక నవతరం నాయకుడి చేతుల్లోకి తమిళనాడు పరిపాలన వెళ్లడంపై అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు సామాన్య ప్రజల్లోనూ ఒక గొప్ప ఆశాభావం కనిపిస్తోంది. సరికొత్త ఆశలతో, సంచలన నిర్ణయాలతో దళపతి 'విజయ్' ప్రస్థానం లాంఛనంగా ప్రారంభమైంది.







# ఆత్మీయ పలకరింపులు.. అరుదైన జ్ఞాపకాలు

**హైదరాబాద్, మహా:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన అధికారిక కార్యక్రమాలతో పాటు ఆత్మీయ కలయికలకు వేదికైంది. ఆదివారం నాటి ఈ పర్యటనలో ఒకవైపు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ప్రధాని.. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాసాలకు స్వయంగా వెళ్లి సందడి చేశారు. దశాబ్దాల రాజకీయ అనుబంధానికి, వ్యక్తిగత ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచిన ఈ అరుదైన ఘట్టాలు రెండు కుటుంబాల్లో జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకాలను మిగిల్చాయి.

**అభివృద్ధి పనులకు శ్రీకారం..**
**సింధు ఆస్పత్రి ప్రారంభం**

హైదరాబాద్ పర్యటనలో తొలుత ప్రధాని మోదీ గచ్చిబౌలిలోని సింధు ఆసుపత్రిని లాంఛనంగా ప్రారంభించారు. ఆసుపత్రి ప్రాంగణంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, ఆసుపత్రిలోని రోబోటిక్ శస్త్రచికిత్స విధానాలను, అత్యాధునిక సాంకేతిక సదుపాయాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆరోగ్య సేవారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఈ ఆసుపత్రి బృందం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. అనంతరం హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. వర్చువల్ విధానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

**చంద్రబాబు ఇంట ప్రధాని సందడి..**
**దేవాన్ష్ తో సరదాగా..**

అధికారిక కార్యక్రమాలు ముగిసిన అనంతరం సాయంత్రం 5:15 గంటల సమయంలో జూబ్లీహిల్స్‌లోని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నివాసానికి మోదీ చేరుకున్నారు. ప్రధానికి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. ప్రధాని రాకతో ఆ ఇంట పండుగ వాతావరణం నెలకొంది. సుమారు గంటకు పైగా (6:20 నిమిషాల వరకు) ఆయన అక్కడే గడిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి మోదీ శ్రీరాముని పూజలో పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు మనవడు దేవాన్ష్‌తో కాసేపు సరదగా గడిపారు. అక్కడే అల్పాహారం స్వీకరించిన అనంతరం చంద్రబాబు, లోకేశ్‌లతో సమావేశమయ్యారు. ఈ పర్యటనపై చంద్రబాబు స్పందిస్తూ.. ప్రధాని తమ ఇంటికి రావడం ఎప్పటికీ గుర్తుండిపోయే జ్ఞాపకమని, ఆయనకు ఆతిథ్యం ఇవ్వడం దక్కిన గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని అందిస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. తమ కుటుంబంలోని మూడు తరాలతో ప్రధాని కలిసి ఉండటం, దేవాన్ష్‌కు ఆశీస్సులు అందించడం గొప్ప వరమని నారా లోకేశ్ ఉద్వేగంగా వెల్లడించారు.

**పవన్ నివాసంలో పరామర్శ..**
**కుటుంబ సభ్యుల పరిచయం**


చంద్రబాబు నివాసం కంటే ముందు ప్రధాని మోదీ.. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాసానికి విచ్చేశారు. ఇటీవల సైనస్ శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్ ఆరోగ్య పరిస్థితిని మోదీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సుమారు 20 నిమిషాల పాటు అక్కడే గడిపిన ప్రధాని, ఆయన త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తన పిల్లలు అకీరా నందన్, ఆద్య, పొలినా అంజనా, మార్క్ శంకర్‌లతో పాటు ఇతర కుటుంబ సభ్యులను ప్రధానికి పరిచయం చేశారు. అత్యంత బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ తన కోసం సమయం కేటాయించి ఇంటికి రావడం మోదీ గొప్ప మనసుకు నిదర్శనమని పవన్ కొనియాడారు. ఒక దేశ ప్రధాని స్వయంగా ఇంటికి వచ్చి పలకరించడం కేవలం రాజకీయం కాదని, అది వ్యక్తిత్వంతో సంపాదించుకున్న గౌరవమని సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన స్పందించారు. ఒకే రోజు, ఒకే నగరంలో.. పొరుగు రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల ఇళ్లకు స్వయంగా దేశ ప్రధాని వెళ్లి సమయం గడపడం రాజకీయ వర్గాల్లో విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. హోదాలను పక్కనపెట్టి ఆత్మీయతను పంచిన మోదీ పర్యటన సఫలవంతంగా ముగిసింది.





# విజయ్ పట్టాభిషేకంలో స్పెషల్ ఎట్రాక్షన్‌గా త్రిష

## ప్రమాణస్వీకారం వేళ ఆకట్టుకున్న అందాల తార



**(మొదటిపేజీ తరువాయి)**

స్టేడియంలో ఆమె అడుగుపెట్టిన క్షణం నుంచి అభిమానుల కేరింతలు మిన్నంటాయి.

**నీలం రంగు పట్టుచీరలో సాక్షాత్కరించిన సంప్రదాయ సౌందర్యం**

ఈ చారిత్రాత్మక వేడుక కోసం త్రిష ఎంతో పద్ధతిగా, అచ్చమైన తమిళ సంప్రదాయ దుస్తుల్లో సాక్షాత్కరించారు. ఆమె ధరించిన నీలం రంగు సిల్క్ పట్టుచీర వేడుకలో తళుక్కుమని మెరిసింది. దీనికి తోడు మెడలో మెరిసే డైమండ్ ఆభరణాలు, తలలో మల్లెపూలు పెట్టుకుని స్టేడియం అంతటా ఒక కొత్త కళను తీసుకొచ్చారు. ఆమె సౌందర్యం సభికులను కట్టిపడేయడమే కాకుండా, సామాజిక మాధ్యమాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. ఒక మహారాణిలా స్టేడియంలోకి ప్రవేశిస్తూ, అభిమానుల వైపు చూసి అభివాదం చేసిన తీరు అందరినీ ఆకట్టుకుంది.

**"తమిళనాట ఇది గొప్ప రోజు"..**
**ఉద్వేగానికి లోనైన నటి**

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యే ముందు మీడియా ప్రతినిధులు ఆమెను పలకరించగా, త్రిష ఎంతో ఉత్సాహంగా స్పందించారు. "తమిళనాడు రాష్ట్రానికి ఇదొక గొప్ప రోజు, ఈ అద్భుత క్షణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా విజయ్ విజయం కోసం ఆకాంక్షించిన ఆమె, చివరకు ఆయన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం పట్ల తన హర్షాన్ని వ్యక్తం చేశారు. ఆమె కళ్లలో కనిపిస్తున్న ఆనందం, విజయ్‌పై ఆమెకు ఉన్న గౌరవాన్ని మరియు స్నేహాన్ని చాటిచెప్పింది.

**విజయ్ కుటుంబ సభ్యులతో**
**త్రిష ఆత్మీయ పలకరింపు**

స్టేడియంలోకి రాగానే త్రిష నేరుగా విజయ్ కుటుంబ సభ్యులు కూర్చున్న ప్రాంతానికి వెళ్లి వారిని పలకరించారు. ముఖ్యంగా విజయ్ తల్లి శోభ, తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్‌లను కలిసి ఆమె అభినందనలు తెలియజేశారు. విజయ్ కుటుంబంతో ఆమెకు దశాబ్దాలుగా ఉన్న అనుబంధం ఈ సందర్భంగా మరోసారి బయటపడింది. విజయ్ పట్టాభిషేకాన్ని చూసి మురిసిపోతున్న ఆయన తల్లిదండ్రులతో కలిసి త్రిష కాసేపు ముచ్చటించారు. ఒక కుటుంబ సభ్యురాలిగా ఆమె అక్కడ ఉన్న తీరు అభిమానుల మనసు గెలుచుకుంది.

**తిరుమల నుంచి నేరుగా దళపతి ఇంటికి..**
**ఆరోజే మొదలైన సందడి**

నిజానికి మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు నుంచే త్రిష సందడి మొదలైంది. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె, అక్కడి నుంచి నేరుగా చెన్నై చేరుకుని విజయ్ నివాసానికి వెళ్లారు. టీవీకే పార్టీ ఘనవిజయం సాధించి ముఖ్యమంత్రి పీఠాన్ని కైవసం చేసుకుంటున్న తరుణంలో, ఆమె నేరుగా ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. అప్పట్లో విజయ్ నివాసం వద్ద ఆమె కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. తన బిజీ షెడ్యూల్‌లో కూడా విజయ్ రాజకీయ ప్రస్థానానికి ఆమె పూర్తి మద్దతునిచ్చారు.

**నెట్టింట వైరల్ అవుతున్న**
**త్రిష 'బిగ్ డే' మేనియా**

ప్రమాణ స్వీకార వేడుకలో త్రిషకు సంబంధించిన ప్రతి కదలికను కెమెరాలు బంధించాయి. ఆమె స్టేడియంలోకి రావడం, ప్రజలకు అభివాదం చేయడం మరియు వేడుకను వీక్షిస్తున్న ఫోటోలు క్షణాల్లో అంతర్జాలంలో విపరీతంగా వైరల్ అయ్యాయి. "తమిళనాడుకు ఇది బిగ్ డే" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు టీవీకే కార్యకర్తలకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. కేవలం సినీ నటిగానే కాకుండా, ఒక బాధ్యతగల పౌరురాలిగా ఈ రాజకీయ మార్పును ఆమె స్వాగతించడం విశేషం. ఆమె ఫోటోలు, వీడియోలు చూస్తుంటే ఈ వేడుకలో ఆమె ఒక కీలక భాగస్వామిలా అనిపించింది.

**వెండితెర జోడీ నుంచి**
**రాజకీయ మద్దతు వరకు..**

విజయ్ మరియు త్రిష మధ్య ఉన్న స్నేహం సినీ పరిశ్రమలో సుపరిచితం. వీరిద్దరూ కలిసి నటించిన 'గిల్లి', 'కురువి' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించాయి. అప్పట్లో వెండితెరపై వెలిగిన ఈ జోడీ, ఇప్పుడు రాజకీయ రంగంలోనూ ఒకరికొకరు తోడుగా నిలవడం ఆసక్తికరంగా మారింది. విజయ్ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించిన నాటి నుంచి త్రిష ఆయనకు తనదైన రీతిలో మద్దతు తెలుపుతూనే ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టిన ఈ సమయంలో ఆమె అక్కడ ఉండటం ఒక చారిత్రక స్నేహానికి నిదర్శనం.

**ప్రమాణ స్వీకార వేడుకలో**
**హైలైట్‌గా త్రిష సందడి**


మొత్తంగా చూస్తే, తమిళనాడు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార వేడుకలో రాజకీయ అంశాల తర్వాత అత్యధికంగా చర్చకు వచ్చింది త్రిష గురించే. ఆమె ధరించిన పట్టుచీర, ఆమె చూపించిన హుందాతనం మరియు విజయ్ కుటుంబంతో ఆమె ప్రవర్తించిన తీరు అద్భుతంగా ఉన్నాయి. వేడుక ముగిసిన తర్వాత కూడా సోషల్ మీడియాలో త్రిష నామస్మరణ కొనసాగుతోంది. దళపతి 'విజయ్' పట్టాభిషేకానికి ఒక తార వెలుగును అద్ది, ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని అభిమానులకు చిరస్మరణీయంగా మార్చడంలో త్రిష విజయవంతమయ్యారు.

# బరితెగించిన అక్రమార్కులు

## కొండాపూర్ సర్వే నెంబర్ 59 గల్లంతు

- ఆరు వందల గజాల ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- విలువ రు 10 కోట్ల పై మాటే.. నకిలీ పత్రాలతో అనుమతులు
- రెండు నిర్మాణాలకు స్టిల్ట్ ప్లస్ మూడు ఫ్లోర్లకు పర్మిషన్లు
- నిర్మించేది మాత్రం ఏడు ఫ్లోర్లు ఆపైన పెంట్ హౌస్ నిర్మాణాలు
- సర్వే నెంబర్ 60 లో జిహెచ్ఎంసీ అనుమతులు పొంది, సర్వే నెంబర్ 59 లో గల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు
- సిఎంసి కమీషనర్ స్పందించాలంటున్న స్థానికులు

**రాజధాని నడిబొడ్డు.. సైబరాబాద్ కార్పోరేషన్ పరిధిలోని కొండాపూర్ లో అక్రమార్కులు బరితెగించారు.. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పక్కా స్కెచ్ వేసి దురాక్రమణకు తెగబడుతున్నారు... నకిలీ పత్రాలు సృష్టించి జి హెచ్ ఎం సి నుండి అనుమతులు పొంది నిర్మాణాలు సాగించటం ఇక్కడ పరిపాటిగా మారింది.. ఆరు వందల గజాల ప్రభుత్వ భూమి విలువ బహిరంగ మార్కెట్లో రు 10 కోట్ల పైమాటే ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.. ప్రభుత్వ భూమి కబ్జా కు గురైందని రెవె న్యూ అధికారలుకు పిర్యాదు చేసిన కబ్జా దారులతో కుమ్మక్కయ్యారని ఎటువంటి చర్యలు తీసుకోలేదని బహిరంగ ఆరోపణలు వ్యక్త మౌతున్నాయి.. అనుమతులు మించి నిర్మాణాలు సాగిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి.**



**ప్రత్యేక ప్రతినిధి, మహా :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేరిలింగం పల్లి మండలం, కూకట్పల్లి జోనల్, మాదాపూర్ సర్కిల్ పరిధి కొండాపూర్ లో భూకబ్జా దారులు పెట్రేగిపోతున్నారు. సర్వే నెంబర్ 60 లో ఆరు వందల చదరపు గజాల స్థలం ఉన్నట్లు చూపించి రెండు భవనాలకు వేరు వేరుగా స్టిల్ట్ ప్లస్ మూడు ఫ్లోర్లు కు నిర్మాణ అనుమతులు పొందారు. కాని వాస్తవంగా సర్వే నెంబర్ 59లో గల ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు జరుగుతున్నట్లు గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా స్పష్టమౌతోంది.రెవెన్యూ అధికార్లకు పిర్యాదులు అందినప్పటికి కబ్జా దారులు లక్షలాది రూపాయలు ముడుపులు ముట్ట జెప్పటంతో వారితో కుమ్మక్కై ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమార్కుల చెరలో ఉన్న ప్రభుత్వభూమి విలువ రు 10కోట్ల పైమాటే ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ఓ నీరు పేద తల దాచుకొనేందుకు 50గజాల్లో గుడిసె వేసుకొంటే దాన్ని కూల్చేంత వరకు నిద్ర పోని రెవెన్యూ అధికారులు ఆరు వందల గజాల ప్రభుత్వ స్థలం అప్పనంగా ఆక్రమించుకొని నకిలీ అనుమతులతో బహుళంతస్తుల నిర్మాణాలు చేపడుతుంటే ఎందుకు అడ్డుకొరని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొండాపూర్ ప్రధాన రహదారి వోక్స్ వ్యాగన్, కియా కార్ల షోరూం వెనుక వైపు అనుమతులకు మించి అక్రమంగా ప్రభుత్వ భూమి లో నిర్మిస్తున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నలోనే ...**

నగరం లో అత్యంత విలువైన ప్రాంతంగా కొండాపూర్ ను పరిగణిస్తారు. ప్రధాన రహదారి పక్కన వోక్స్ వ్యాగన్,కియా కార్ల షోమ్ వెనుక వైపు ప్రభుత్వ భూమిలో జరుగుతున్నా బహుళంతస్తుల నిర్మాణాలు టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సర్కిళ్లు విభజన కాక ముందు శేరిలింగంపల్లి జోనల్, చందానగర్ సర్కిల్ నుండి నిర్మాణ అనుమతులు జారీ చేయబడ్డాయి. ప్రస్తుతం కూకట్పల్లి జోనల్ పరిధి మాదాపూర్ సర్కిల్ లో కొండాపూర్ ను కలపబడింది. దాంతో సర్కిల్ అధికారులు మాది కాదంటే.. మాది కాదంటూ.. ఒకరిపై ఒకరు నెపం వేసుకొని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని స్థానిక ప్రజలు మండి పడుతున్నారు. ఆరు వందల చదరపు గజాల్లో ప్లాట్ నెంబర్ 13సి, లో 337.19 స్క్వేర్ మీటర్లు, ఫైల్ నెంబర్ 000216/జి హెచ్ ఎం సి /00206/ఐ ఏ బీ పీ /సి 21/2025,పర్మిట్ నెంబర్ 0140/జి హెచ్ ఎం సి /ఐ ఏ /సి 21/2025,ది 26/4/2025న, మరో ప్లాట్ నెంబర్ 001348/జి హెచ్ ఎం సి /0/1088/ఐ ఏ బి పీ /సీ 21/2025,పర్మిట్ నెంబర్ 0664/జి హెచ్ ఎం సి /ఐ ఏ /సి 21/2025ది 26/5/2025న అడ్డదారిలో ఆక్రమణ దారులు అనుమతులు పొందారు.అయితే అనుమతులు పొందింది రెండు బిల్డింగ్ లకు స్టిల్ట్ ప్లస్ మూడు ఫ్లోర్లకు కాని ఏడు అంతస్తులు ఆపైన పెంట్ హౌస్ నిర్మాణాలు చేపడుతున్నారు.అధికారుల అండదండలు లేకుండా ఇదేలా సాధ్యం అవుతుందొ వారే చెప్పాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావటమే కాకుండా అదనపు అంతస్తులకు రావాల్సిన లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఖాజానకు చేరకుండా పక్కా దారి పడుతున్నాయి... ఇదిలా ఉంటే నిర్మాణాలు పూర్తి కాకుండానే ఓ.సి లు జారీ చేయటం ద్వారా రు 70లక్షలు రూపాయలు చేతులు మారినట్లు స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**సి ఎం సి కమీషనర్**
**స్పందించాలంటున్న స్థానికులు**

కొండాపూర్ లో రు 10 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించటమే కాకుండా సర్వే నెంబర్లు మార్చిన అక్రమార్కులపై సి ఎం సి కమీషనర్ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. అలాగే జి ప్లస్ మూడు ఫ్లోర్లకు అనుమతులు తీసుకోని ఏడు ఫ్లోర్లు తో పాటు పెంట్ హౌస్ నిర్మాణాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికార్లు,. ప్రభుత్వ స్థలమని రెవెన్యూ అధికార్లకు పిర్యాదు చేసిన పట్టించుకోలేదని అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికార్లపై చర్యలు తీసుకోవటం తో పాటు అక్రమ నిర్మాణాలను సీజ్ చేయాలని స్థానిక ప్రజలు కమీషనర్ ను అభ్యర్థిస్తున్నారు.

# విద్యార్థులకు ఊరట

- ఈ ఏడాది యథావిధిగా ఇంటర్ ప్రవేశాలు!
- విలీన ప్రక్రియ తాత్కాలిక వాయిదా
- సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం
- సాంకేతిక సమస్యలు, సమయాభావం దృష్ట్యా సర్కారు వెనక్కి
- త్వరలోనే అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్మిషన్లను గతంలో మాదిరిగానే యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే ప్రతిపాదనపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రస్తుతానికి ఆ ప్రక్రియను వాయిదా వేయాలని ఆదేశించారు. విలీన ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు, ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండటాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థుల విద్యాసంవత్సరం దెబ్బతినకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో గత కొద్ది రోజులుగా అడ్మిషన్ల ప్రక్రియపై నెలకొన్న ఉత్కంఠకు ముగింపు పలికినట్లయింది.

**విలీన ప్రతిపాదన.. విద్యా కమిషన్ సూచనలు**

రాష్ట్రంలో పదో తరగతి తర్వాత విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడాన్ని (డ్రాపౌట్స్) అరికట్టేందుకు ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయాలని ప్రభుత్వం భావించింది. సీబీఎస్ఈ (CBSE) విధానంలో మాదిరిగానే 11, 12 తరగతులుగా వీటిని నిర్వహించాలని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా అదే పాఠశాలలో పై తరగతులు చదువుకునే వీలు కల్పించడం ద్వారా డ్రాపౌట్స్ సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. మెజారిటీ రాష్ట్రాల్లో కూడా ఇదే విధానం అమలవుతుండటంతో రేవంత్ సర్కార్ కూడా ఈ దిశగా అడుగులు వేసింది.


**అయోమయానికి గురిచేసిన షెడ్యూల్ రద్దు**

విలీన ప్రక్రియపై కసరత్తు జరుగుతున్న క్రమంలోనే, ఈ నెల 4వ తేదీన ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేసింది. అయితే, ప్రభుత్వం నుంచి విలీనంపై స్పష్టత లేకపోవడంతో మరుసటి రోజే (మే 5న) ఆ షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. ఒక్కసారిగా తీసుకున్న ఈ నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒకవైపు ఫలితాలు వచ్చి అడ్మిషన్ల సమయం దగ్గర పడుతుండటం, మరోవైపు విలీనంపై స్పష్టత లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలల వైపు వెళ్లాలా లేదా ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూడాలా అన్న అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా మరియు ఇతర కీలక అధికారులతో సమావేశమయ్యారు. ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేయడం వల్ల కలిగే లాభనష్టాలపై క్షుణ్ణంగా చర్చించారు.

# బంగారం కొనడం మానేద్దాం

- మహిళలకు మోదీ పిలుపు
- విదేశీ ప్రయాణాలు తగ్గించండి

**హైదరాబాద్, మహా:** దేశీయంగా బంగారం వినియోగంపై ప్రధాని మోదీ దేశప్రజలకు రిక్వెస్ట్ చేశారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఈ తరుణంలో ప్రజలు కనీసం ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నిలిపివేయాలని ఆయన కోరారు. పండుగలు, శుభకార్యాల కోసం చేసే భారీ కొనుగోళ్లను తగ్గించడం వల్ల దేశం నుండి బయటకు వెళ్లే విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుందని, అది దేశాభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. కేవలం బంగారం మాత్రమే కాకుండా, విదేశీ పర్యటనలు, విదేశాల్లో నిర్వహించే 'డెస్టినేషన్ మ్యారేజ్'లను కూడా తగ్గించుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి విదేశీ ఖర్చులను తగ్గించుకుని, ఆ నిధులను దేశీయ మార్కెట్లోనే వినియోగించడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రధాని తన ప్రసంగంలో నొక్కి చెప్పారు.







## నిబంధనలన్నీ హీరోయిన్లకే!

“బాలీవుడ్‌లో వివక్ష ఎక్కువ. ఒక సినిమా బడ్జెట్ తగ్గించాలంటే ముందు హీరోయిన్ల పారితోషికం తగ్గిస్తారు. అలాగే లొకేషన్‌కి హీరో రాక ముందే హీరోయిన్ మేకప్ వేసుకుని రెడీగా ఉండాలంటారు. సెట్స్‌లో హీరో ఏది అడిగినా కాదనకుండా సమకూర్చుతారు. గౌరవ మర్యాదల విషయంలోనూ తేడా చూపించేస్తారు. నిబంధనలన్నీ హీరోయిన్లకే ఉంటాయి” అని కృతీ సనన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఆమె నటించిన ‘కాక్‌టెయిల్ 2’ చిత్రం జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న కృతీ సనన్... “బాలీవుడ్‌లో నేను నెపోటిజమ్ బాధితురాలిని” అని పేర్కొన్నారు. ఈ విషయం గురించి ఇంకా మాట్లాడుతూ – “స్టార్ కిడ్స్ వల్ల బాలీవుడ్‌లో చాలా అవకాశాలు కోల్పోయాను. ముందు నన్ను హీరోయిన్‌గా తీసుకుని, ఆ తర్వాత స్టార్ కిడ్స్ కోసం నన్ను పక్కన పెట్టిన సందర్భాలు చాలా ఉన్నాయి. వారసులతో పోటీ పడి అవకాశాలు తెచ్చుకోవడానికి చాలా కష్టపడ్డాను. ‘మిమి’ సినిమాకి ముందు ఐదేళ్లు నా కెరీర్ ఎంతో కష్టంగా సాగింది. టాలెంట్ ఉండి కూడా అవకాశాల కోసం చాలా ఎదురు చూడాల్సి వచ్చేది. దాంతో కొంత ఒత్తిడికి లోనై, సినిమాల ఎంపిక విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాను. కొన్ని చేదు అనుభవాలు, పరాజయాలు, కష్టాలు అనుభవ పాఠాలుగా ఉపయోగపడ్డాయి. కెరీర్‌లో ధైర్యంగా ఎలా ముందుకు సాగాలో నేర్పించాయి” అని పేర్కొన్నారు కృతీ సనన్.

## బోల్డ్ హారర్‌లో...

ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ కనిపించనంత బోల్డ్‌గా తమన్నా కనిపిస్తారని ఆమె కమిట్ అయిన తాజా చిత్రం స్పష్టం చేస్తోంది. ఇంతకీ అది ఏ సినిమా అంటే... బాలీవుడ్‌లో బోల్డ్ హారర్ మూవీగా పాపులర్ అయిన ‘రాగిణి ఎంఎంఎస్’లోని మూడో భాగం. ఏక్తా కపూర్ నిర్మించిన ‘రాగిణి ఎంఎంఎస్’, ఆ చిత్రం సీక్వెల్ ‘రాగిణి ఎంఎంఎస్ 2’ ఘనవిజయాన్ని సొంతం చేసుకున్నాయి. తొలి భాగంలో కైనాజ్ మోతీవాలా, రెండో భాగంలో సన్నీ లియోన్ లీడ్ రోల్స్ చేశారు. మూడో భాగంలో తమన్నా నటించనున్నారు. ఈ పాత్ర చాలా గ్లామరస్‌గా ఉంటుంది. అలాగే ఈ సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్‌లో రొమాన్స్ మోతాదు కూడా ఎక్కువగానే ఉన్న విషయం రెండు భాగాలు చూసినవాళ్లకు తెలిసే ఉంటుంది. మూడో భాగంలో కూడా అలానే ఉంటుందని, మోడ్రన్ అమ్మాయిగా, ఆత్మగా తమన్నా రెండు షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో ఆయుష్ శర్మ సరసన ఆమె నటిస్తారు. తమన్నాకన్నా ఆయుష్ ఏడాది చిన్న. ఇంకా ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారట. శశాంక్ ఘోష్ దర్శకత్వంలో ఏక్తా కపూర్ నిర్మించనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034